www.prajasakti.com
ప్రజాశక్తి
గురువారం 31 జులై 2025
5
తిరుపతి



డ్రైనేజీ కాలువల్లో చెత్త తొలగించండి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: డ్రైనేజీ కాలువల్లో మురుగు నీరు నిలవకుండా ఎప్పటికప్పుడు చెత్త తొలగించాలని కమిషనర్ ఎన్.మౌర్య అధికారులను ఆదేశించారు. బుధవారం ఉదయం 31వ వార్డు, బొమ్మగుంట తదితర ప్రాంతాల్లో కార్పొరేటర్ రేవతి, అధికారులతో కలసి పారిశుధ్య పనులను పరిశీలించారు. డ్రైనేజీ కాలువల్లో మురుగునీరు నిల్వ ఉండడం వలన దోమలు వ్యాపిస్తున్నాయని పిర్యాదులు వస్తున్నాయన్నారు. నీరు నిల్వ లేకుండా చర్యలు చేపట్టి, దోమలు వృద్ధి చెందకుండా మందులు పిచికారీ చేయాలని అధికారులను ఆదేశించారు. బొమ్మగుంటలో పారిశుధ్య పనులు మరింత మెరుగ్గా చేపట్టి, త్రాగునీరు సరైన సమయంలో పంపిణీ చేయాలన్నారు. కమిషనర్ వెంట 31వ వార్డు సూపరింటెండెంట్ ఇంజినీర్ శ్యాంసుందర్, మునిసిపల్ ఇంజినీర్ గోమతి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, రెవిన్యూ ఆఫీసర్ సేతు మాధవ్ తదితరులు ఉన్నారు.

నింగికెగసిన నిసార్

102వ ప్రయోగం విజయవంతం

ఇస్రో చైర్మన్ వి.నారాయణన్

ప్రజాశక్తి - సూళ్లూరుపేట (తిరుపతి జిల్లా): భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అమెరికా అంతరిక్ష పరిశోధన సంస్థ (నాసా) తొలిసారిగా సంయుక్తంగా రూపొందించిన నాసాబి ఇస్రో సింథటిక్ అపార్చర్ రాడార్ (నిసార్) అనే ఉపగ్రహాన్ని బుధవారం సాయంత్రం 5.40 గంటలకు ప్రయోగించి విజయం సాధించారు. జియో సింక్రానాస్ లాంచింగ్ వెహికల్ (జిఎస్ఎల్వీఎఫ్ 16) రాకెట్ ద్వారా 98.40 డిగ్రీల వంపుతో భూమికి 743 కిలోమీటర్లు ఎత్తులోని సూర్య సమకాలిక కక్షలోకి నిసార్ ఉపగ్రహాన్ని ప్రవేశపెట్టారు. భూగోళాన్ని పరిశోధించేందుకు ఎంతో దోహదపడే ఈ ఉపగ్రహం సుమారు 5 ఏళ్ల పాటు సేవలు అందిస్తుందని, భవిష్యత్తులో ఇస్రో- నాసా కలిసి మరిన్ని ప్రయోగాలు చేయనున్నట్లు ఇస్రో చైర్మన్ వి.నారాయణన్ తెలిపారు. ఈ సందర్భంగా ఇస్రో చైర్మన్ మాట్లాడుతూ ఇస్రో- నాసా బంధం బలపడి రాబోయే కాలంలో మరో మూడు ప్రయోగాలను సంయుక్తంగా నిర్వహించేందుకు ఒప్పందం చేసుకున్నామని పేర్కొన్నారు. నిసార్ ఉపగ్రహంలో ఉన్న సాంకేతిక పరికరాలను సంయుక్తంగా రూపొందించడం జరిగిందని తెలిపారు. రాబోయే కాలంలో మరిన్ని వాణిజ్య ప్రయోగాలు జరుగుతాయని తెలిపారు. చంద్రయాన్- 4 ప్రయోగ పనులకు శ్రీకారం చుడతామని చెప్పారు. ఈ ఏడాది ఆఖరు నాటికి గగనయాన్-1 పేరుతో ప్రయోగం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. పిఎస్ఎల్వి సిరీస్‌లో కూడా మరో 4 ప్రయోగాలు చేసేందుకు లక్ష్యంగా పెట్టుకున్నామని తెలిపారు.

నిసార్ ఉపగ్రహం పూర్తిగా వాతావరణ సమాచారం కోసం చేస్తున్న ప్రయోగం 2,392 కిలోల బరువు కలిగిన నిసార్ ఉపగ్రహం 5 సంవత్సరాలు పాటు అంతరిక్షం నుండి సేవలు అందించనుంది. ఈ ఉపగ్రహం ద్వారా విలువైన వాతావరణ సమాచారం అందుతుంది. నిసార్ ఉపగ్రహం ప్రయోగం అనంతరం ప్రతి 12 రోజులకు ఒకసారి భూమిని చుడుతూ పరిశీలించిన సమాచారాన్ని ఇస్రో కేంద్రానికి అందిస్తుంది. ఈ ఉపగ్రహం స్పష్టమైన త్రీడీ చిత్రాలను అందిస్తుంది. ఈ ఉపగ్రహం ప్రకృతి విపత్తులను ముందుగానే తెలియజేస్తుంది. భూకంపాలు, వరదలు, అగ్నిపర్వతాల విస్ఫోటనాలు, సునామి వంటి విపత్కర ప్రమాదాల సమాచారాన్ని ముందుగానే అందిస్తుంది. మంచు పర్వతాల కదలికలు, కొండల చర్యలు కదలకలను నిసార్ ఉపగ్రహం ద్వారా గుర్తించవచ్చు. నిసార్ ఉపగ్రహం నిఘా ఉపగ్రహంగా కూడా ఉపయోగపడుతుంది. ఇది ఇస్రో కేంద్రమైన శ్రీహరికోట అంతరిక్ష ప్రయోగ కేంద్రం నుంచి షార్ చేపట్టిన 102వ ప్రయోగం కాగా జిఎస్ఎల్వి సిరీస్‌లో ఇది 18వ ప్రయోగం.

ఇస్రో శాస్త్రవేత్తలకు శ్రీసిటీ ఎండీ అభినందనలు

ప్రజాశక్తి - వరదయ్యపాలెం: జీఎస్ఎల్వీ-ఎఫ్16 రాకెట్ ప్రయోగం విజయవంతం అయినందుకు శ్రీసిటీ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ రవీంద్ర సన్నారెడ్డి హర్షం వెలిబుచ్చారు. ఈ ప్రయోగం ద్వారా నిసార్ ఉపగ్రహాన్ని నిర్ణీత కక్ష్యలోకి పంపడంలో ఘన విజయం సాధించినందుకు, భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) అధ్యక్షులు డా. వీ. నారాయణన్, షార్ డైరెక్టర్ ఏ.రాజరాజన్, షార్ శాస్త్రవేత్తలు , ఇతర ఉద్యోగులకు అభినందనలు తెలిపారు. జీఎస్ఎల్వీ ద్వారా మరొక అత్యాధునిక ఉపగ్రహాన్ని నింగిలోకి పంపడం ద్వారా అంతరిక్ష రంగంలో అసమాన విజయం ఇస్రో సాధించటం దేశానికి గర్వ కారణమని ఆయన పేర్కొన్నారు. ఈ ప్రయోగం, అంతరిక్ష రంగంలో భారత్-అమెరికా దేశాల పరస్పర సహకారంలో ఒక మైలు రాయిగా నిలుస్తుందని ఆయన అన్నారు.

గ్యాలరీలో పదివేల మంది వీక్షకులు..

గతంలో ఎప్పుడు లేని విధంగా శ్రీహరికోట గ్యాలరీలో దాదాపు పదివేల మంది విద్యార్థులు ఈ ప్రయోగాన్ని వీక్షించారు. ప్రయోగం అనంతరం హర్షద్వానాలతో శ్రీహరికోట మార్మోగింది. ప్రయోగం విజయవంతం కావడంతో నాసా శాస్త్రవేత్తలు, ఇస్రో శాస్త్రవేత్తలు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

అంతర్రాష్ట్ర దొంగల ముఠా అరెస్ట్

- రూ. 20 లక్షల 40 వేల సొత్తు స్వాధీనం

వివరాలు వెల్లడిస్తున్న జిల్లా ఎస్పీ హర్షవర్ధన్ రాజు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అంతర్ రాష్ట్ర దొంగల ముఠాను అదుపులోకి తీసుకుని, వారి వద్ద నుంచి 20 లక్షల 40 వేల రూపాయల సొత్తు స్వాధీనం చేసుకున్నట్లు తిరుపతి జిల్లా ఎస్ పి హర్షవర్ధన్ రాజు తెలిపారు. స్థానిక పోలీసు పెరడ్ గ్రౌండ్‌లో బుధవారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ తిరుపతి జిల్లా, తమిళనాడుకు చెందిన 6 మంది నిందితులు అంతర్ రాష్ట్ర ముఠాగా ఏర్పడి, రాత్రి పూట ఇళ్లల్లో చోరీలకు పాల్పడే వారని తెలిపారు. వీరిపై నిఘా ఉంచి పుత్తూరు పోలుసులు బుధవారం అదుపులోకి తీసుకున్నారని తెలిపారు. తమిళనాడు సేరిక్కల్ గ్రామానికి చెందిన ఎం.మణి(38), ఎం.సురేష్ (35), చిదంబరంకు చెందిన ఎం.ప్రభు (26), అనైక ట్టుకు చెందిన మణికంఠ (47), తిరుపతి మంగళంకు చెందిన ఎస్.కుమార్ (29), ఏ.మణికంఠ (25) ఆరుగురు పాత నేరస్థులు, జైల్లో వీరికి పరిచయం ఏర్పడడంతో ముఠాగా దొంగతనాలకు పాల్పడే వారు. పోలీసులు వలపన్ని నలుగుర్ని అదుపులోకి తీసుకోగా, తమిళనాడుకు చెందిన ప్రభు, మణికంఠ పరారిలో వున్నారని తెలి పారు. త్వరలోనే వారిని కూడా పట్టుకుంటామని వెల్లడించారు. నిందితులను రిమాండుకు తరలించామని తెలి పారు. ఈ సమావేశములో డీఎస్పీ రవికుమార్, సీఐ రవీంద్ర, ఎస్ఐలు ఓబయ్య, నరేష్, వెంకటేష్, క్రైమ్ సిబ్బంది దాము, నాగరాజు, రమేష్, మోహన్, రాజశేఖర్, బారుష, రవిప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

ఏనుగుల గుంపుపై నిరంతర నిఘా

- డ్రోన్‌లతో ఏనుగుల గమనాన్ని గుర్తిస్తున్నాం : నాగభూషణం

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): శ్రీవారి మెట్టు అటవీ ప్రాంతంలో ఏనుగుల గుంపు పై డ్రోన్ కెమెరాలతో నిరంతర నిఘా ఉంచి వాటి గమనాన్ని పర్యవేక్షిస్తున్నామని సబ్ డిఎఫ్ఓ నాగభూషణం తెలిపారు. అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు తిరుమలకు వెళ్లే శ్రీవారి భక్తుల భద్రతను దృష్టిలో ఉంచుకొని శ్రీవారి మెట్టు మార్గంలో తిరుమలకు వెళ్లే భక్తులను గుంపులు గుంపులుగా వెళ్లేట్టుగా నిర్ణయాలను అమలు చేస్తున్నామన్నారు. టీటీడీ, అటవీశాఖ, ప్రత్యేకంగా ఎలిఫెంట్ టాస్క్ ఫోర్స్ పెట్రోలింగ్ ద్వారా ఏనుగుల గమనాన్ని గుర్తిస్తూ తదనుగుణంగా నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తున్నామన్నారు. సత్య సాయి ఎస్టి కాలనీ సమీపంలో 10 ఏనుగుల గుంపు వాటి 4 పిల్లలతో ఉన్నట్లుగా ఇప్పటికే గుర్తించామన్నారు.

ముక్కంటి హుండీ ఆదాయం రూ. 2.68 కోట్లు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వర స్వామీ, అమ్మవార్లకు, పరివార దేవతలకు భక్తులు సమర్పించిన హుండీ ఆదాయం 2 కోట్లా 68 లక్షలా 87 వేలా 640 రూపాయలు వచ్చింది. స్థానిక ఆలయంలో బుధవారం హుండీ లెక్కింపులు జరిగాయి. బంగారం 0.097 గ్రాములు, వెండి 882.250 కిలోలు, 235 విదేశీ కరెన్సీ నోట్లు వచ్చినట్లు ఈవో బాపిరెడ్డి తెలిపారు.

97 మంది మార్గదర్శులను గుర్తించాం

- 641 బంగారు కుటుంబాలను అటాచ్ చేశాం
- పి4 సర్వేపై సచివాలయ సిబ్బందితో సమావేశంలో ఎంపీడీవో శ్రీనివాసులు

ప్రజాశక్తి - వాకాడు: వాకాడు మండలం, మండల పరిషత్ అభివృద్ధి కార్యాలయంలో బుధవారం ఎంపీడీవో శ్రీనివాసులు అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో పి ఫోర్ సర్వేపై చర్చ జరిగింది. తిరుపతి జిల్లా కలెక్టర్ మండల పరిధజలో మొత్తం 1979 మంది పేదలని గుర్తించి, వారిలో 1548 మందిని లక్ష్యంగా చేసుకొని దత్తత కార్యక్రమాన్ని పూర్తి చేయాలని ఆదేశించారని ఎంపీడీవో తెలిపారు. ఇప్పటివరకు మండలంలో ఉన్నత కుటుంబాలను (మార్గదర్శులను) 97 మందిని గుర్తించి, వారికి 641(బంగారు కుటుంబాలు) మందిని అటాచ్ చేయడం జరిగిందని తెలిపారు. సచివాలయ సిబ్బంది వారి పంచాయతీలో ఉన్న మార్గదర్శులను (ప్రవాస భారతీయులు, ఆక్వా కల్చర్‌కు సంబంధించిన వారు, భూస్వాములు) గుర్తించి ఈ కార్యక్రమాన్ని వివరించి, పేదలని దత్తత తీసుకొని పేదరికం లేని సమాజం కోసం పాటుపడాలని సూచించాలన్నారు. జనాభా తరుగుదల విషయంలో ప్రభుత్వం ఏర్పాటు చేసిన సర్వేలో ప్రజలను అభిప్రాయాలు తెలియచెప్పే కార్యక్రమాన్ని కూడా పూర్తి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, డిప్యూటీ తాసిల్దార్ రఫీ, పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, మహిళా పోలీసులు, డిజిటల్ అసిస్టెంట్లు, వీఆర్వోలు పాల్గొన్నారు.

ఘాట్ రోడ్ వాహనాలపై నిర్దిష్టమైన పాలసీ డాక్యుమెంట్ సిద్ధం చేయాలి

- అధికారులకు టీటీడీ అదనపు ఈవో ఆదేశం

ప్రజాశక్తి - తిరుమల: తిరుమలలో రోజు రోజుకు పెరుగుతున్న వాహనాల రాకపోకలను, తద్వారా ఏర్పడుతున్న వాతావరణ కాలుష్యాన్ని దృష్టిలో ఉంచుకొని, ఘాట్ రోడ్లలో వాహనాలు తిరుమలలో ట్రాఫిక్ నియంత్రణపై పాలసీ డాక్యుమెంట్ సిద్ధం చేయాలని టీటీడీ అదనపు ఈవో సి. హెచ్. వెంకయ్య చౌదరి సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం తిరుమల గోకులం సమావేశ మందిరంలో టీటీడీ ట్రాన్స్‌పోర్ట్, అటవీ, విజిలెన్స్, ఆర్టీఏ విభాగాల అధికారులతో సమావేశం నిర్వహించారు. తిరుమలలో ట్రాఫిక్‌ను నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై ఆయన సమీక్షించారు. ఈ సందర్భంగా అదనపు ఈవో మాట్లాడుతూ పాలసీ డాక్యుమెంట్ లో ఈవీ పాలసీ, పబ్లిక్ ట్రాన్స్‌పోర్ట్‌ను బలోపేతం చేయడం, ప్రైవేట్ జీప్ డ్రైవర్లకు అవగాహన కల్పించడం, పాత వాహనాల వల్ల ఏర్పడుతున్న పర్యావరణ కాలుష్యాన్ని నివారించేందుకు ట్రాఫిక్ నియమాలను కఠినంగా అమలు చేయడం వంటి అంశాలు చేర్చాలని సూచించారు. అలాగే తిరుమలలో ప్రీపెయిడ్ టాక్సీ సదుపాయం ఏర్పాటు చేసేందుకు ప్రత్యేక పార్కింగ్ స్థలం గుర్తించడంతో పాటు భక్తుల సౌకర్యార్థం కనీస, గరిష్ట ఛార్జీలను నిర్ణయించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రాన్స్‌పోర్ట్ జీఎం శేషా రెడ్డి, టీటీడీ డిప్యూటీ సిఎఫ్ ఫణికుమార్ నాయుడు, విజిలెన్స్ అధికారులు రామ్‌కుమార్, సురేంద్ర, జిల్లా రవాణా అధికారి కె.మురళి మోహన్, అధికారులు పాల్గొన్నారు.

దుకాణాల వేలం పాట

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: తిరుపతి నగరపాలక సంస్థ పరిధిలోని ఖాళీగా ఉన్న దుకాణాలకు కమిషనర్ ఎన్.మౌర్య సమక్షంలో బుధవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. కరంబాడి మార్గంలోని వినాయక సాగర్ వద్ద గల దుకాణ సముదాయం, వినాయక సాగర్ పార్కింగ్, ప్రవేశ రుసుము, గేమ్ జోన్, లీలా మహల్ వద్ద గల షాపింగ్ కాంప్లెక్స్ లోని గదులు, ఇందిరా మైదానం లోని స్పోర్ట్స్ కాంప్లెక్స్, ఇందిరాప్రియదర్శిని కూరగాయల మార్కెట్ లోని దుకాణాలకు, శ్రీనివాసం ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్ లోని దుకాణాలకు బహిరంగ వేలం నిర్వహించారు. కాగా వినాయక సాగర్ పార్కింగ్, ప్రవేశ రుసుము, గేమ్ జోన్ వేలం వాయిదా పడింది. ఇందిరా ప్రియదర్శిని కూరగాయల మార్కెట్ లోని దుకాణాలకు, శ్రీనివాసం ఎదురుగా గల షాపింగ్ కాంప్లెక్స్ లోని దుకాణాలకు, వైకుంఠపురం మార్కెట్‌లో గల దుకాణాలకు నిర్వహించిన వేలంలో ఎవ్వరూ పాల్గొనలేదు. ఈ బహిరంగ వేలం డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రెవెన్యూ అధికారులు సేతుమాధవ్, రవి, ఆర్.ఐ.లు తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారిసేవలో ప్రముఖులు

ప్రజాశక్తి - తిరుమల:

తిరుమల శ్రీవారిని పలువురు సినీ ప్రముఖులు బుధవారం దర్శించుకున్నారు. వీఐపీ ప్రారంభ విరామ దర్శన సమయంలో ప్రముఖ నిర్మాత దిల్ రాజు, నటుడు అశోక్ కుమార్, కన్నడ సినీనటుడు పునీత్ రాజ్ కుమార్ సతీమణి అశ్విని పునీత్ రాజ్ కుమార్, గాలి జనార్ధన్‌రెడ్డి, ఆయన కుమారుడు కిరీటి తదితరులు స్వామివారిని దర్శించుకున్న వారిలో ఉన్నారు. ఈ సందర్భంగా టీటీడీ అధికారులు ఆలయ మర్యాదల ప్రకారం స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. దర్శన అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు ఆశీర్వచన, తీర్థప్రసాదాలను అందజేశారు.

ఇంజన్లు ఇచ్చారు.. ట్రాలీలు మరిచారు

- నిరుపయోగంగా ట్రాక్టర్ ఇంజన్లు
- సొంత పనులకు వాడుకుంటున్న వైనం
- ఎంపీ నిధులతో ట్రాలీలు ఇప్పించాలి

ప్రజాశక్తి - రామచంద్రపురం: గ్రామ పంచాయతీలలో స్వచ్ఛభారత్ కార్యక్రమంలో పరిసరాల పరిశుభ్రత, చెత్త సేకరణ కోసం స్వచ్ఛ భారత్ మిషన్ నిధులతో గ్రామపంచాయతీలకు కూటమి ప్రభుత్వం ట్రాక్టర్ ఇంజన్లను పంపిణీ చేసింది. కానీ ట్రాక్టర్ ఇంజన్లకు ట్రాలీలు లేకపోవడంతో ప్రభుత్వ ఆశయం నీరుగారింది. మండలంలో సి రామాపురం, సొరకాయలపాల్యం, కుప్పం బాదూరు, నెత్తకుప్పం, అనుపల్లి గ్రామపంచాయతీలకు ట్రాక్టర్ ఇంజన్లను స్థానిక శాసనసభ్యులు పులివర్తి నాని పంపిణీ చేశారు. కానీ కొన్ని పంచాయతీలలో ట్రాక్టర్లు పంచాయతీ కార్యాలయం ఆవరణలోనే ఎండకు ఎండుతూ.. వానకు తడుస్తూ తుప్పుబట్టి నిరుపయోగంగా ఉన్నాయి. సి రామపురంలో మాత్రం పాత ట్రాలీను ఉపయోగించుకుని చెత్త సేకరణకు ట్రాక్టర్ ఇంజన్ ఉపయోగిస్తున్నారు. మరి కొన్ని చోట్ల ట్రాక్టర్ ఇంజన్లను చోటా నాయకులు సొంత పనులకు ఉపయోగించు కుంటున్నారని ప్రజలు బహిరంగంగా విమర్శిస్తున్నారు. ట్రాక్టర్ల ఇంజన్లు ఉపయోగించుకోవాలంటే ట్రాలీ కచ్చితంగా అవసరం. ట్రాలీ కొనుగోలు చేసుకునేందుకు పంచాయతీలలో డబ్బులు లేవని పంచాయతీ అధికారులు చెబుతున్నారు. చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ల ప్రసాదరావు స్పందించి ర్యాలీలు కొనుగోలు చేసుకునేందుకు ఎంపీ నిధులు మంజూరు చేయాలని పలువురు కోరుతున్నారు. ట్రాక్టర్ ఇంజన్‌కు ట్రాలీలు కొనిస్తే గ్రామాలలో చెత్త సేకరణ చేసి చెత్తతో సంపద తయారీ కేంద్రాలకు తరలించేందుకు ఉపయోగపడుతాయని స్థానికులు తెలిపారు. ఎంపీ దగ్గుమళ్ల ప్రసాద్ రావు ట్రాక్టర్ ట్రాలీలను కొనుక్కునేందుకు నిధులు మంజూరు చేస్తే గ్రామాల్లో పారిశుధ్యం మెరుగుపడుతుంది, పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛ భారత్ మిషన్, ప్రభుత్వ ఆశయం నెరవేరుతుంది.

చిత్తడి నేలల సంరక్షణకు అటవీశాఖ చర్యలు

- బిఎన్ కండ్రిగలోని కంచన పుత్తూరు భూములు ఎంపిక

సంరక్షణకు ఎంపిక చేయబడిన కంచన పుత్తూరు పెద్ద చెరువు భూ పరిసరాలు (ఉపగ్రహ ఛాయా చిత్రం)

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): చిత్తడి నేలల సంరక్షణకు తిరుపతి జిల్లా అటవీశాఖ ప్రత్యేక చర్యలను తీసుకొంది. తిరుపతి జిల్లా, బుచ్చి నాయుడు కండ్రిగ మండల పరిధిలోని కంచన పుత్తూరు, గాజుల పెళ్లూరు ప్రాంతంలోని 100 ఎకరాల చిత్తడి నేలను సంరక్షణ చేయాలని ప్రత్యేక రిపోర్టును జిల్లా అటవీశాఖ తయారు చేసింది. మంగళవారం జిల్లా కలెక్టరేట్లో డీఎల్సీసీ సమావేశంలో ఈ వెట్ ల్యాండ్ డాక్యుమెంట్ పై లైన్ డిపార్ట్మెంట్‌లతో జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ సమీక్ష నిర్వహించారు. దీనిపై సత్యవేడు ఎఫ్ఆర్ఓ త్రినాథ్ రెడ్డి తెలిపిన వివరాల మేరకు భారత ప్రభుత్వం 2017లో చిత్తడి నేలలను గుర్తించి సంరక్షించాలని అన్ని రాష్ట్రాలకు నిబంధనలతో కూడిన ఆదేశాలను జారీ చేసింది. అందులో భాగంగా రిజర్వ్ ఫారెస్ట్ పరిధి కాకుండా ఉన్న చిత్తడి నేలలను అన్వేషించి వాటి సంరక్షణకు చర్యలు తీసుకోవాలని సమీక్ష సమావేశాలలో జిల్లా అధికారులు సూచించారు. తిరుపతి జిల్లా నుండి బిఎన్ కండ్రిగ మండలం, కంచన పుత్తూరులో ఉన్న పెద్ద చెరువు, దాని సమీప ప్రాంతం మొత్తం 100 ఎకరాలకు పైబడి భూమిని ఎంపిక చేసామని తెలిపారు.

చిత్తడి నేల వలన కలిగే ప్రయోజనాలను ఎక్కడ దెబ్బ తినకుండా, నోటిఫై అయిన చిత్తడి నేల అన్యాక్రాంతం కాకుండా, కలుషితం కాకుండా కాపాడడానికి ఈ ఎంపిక జరిగిందన్నారు. ఈ ఎంపిక చేసిన కంచన పుత్తూరు ప్రాంతం ప్రజా వినియోగంలో ఉంది. ప్రజలు ఎప్పటిలాగే ఈ భూమిలో వారి పనులకు వినియోగించుకోవచ్చు. డిఎల్సిసి సమావేశంలో దీనిపై సుదీర్ఘ చర్చ జరిగిందన్నారు. జిల్లా కలెక్టర్ ఆమోదం తర్వాత అటవీ శాఖ మంత్రి అధ్యక్షతన స్టేట్ వెట్ ల్యాండ్ అథారిటీ, సమన్వయ అధికారులు అందరూ చర్చించి ఎంపిక చేసిన కంచన పుత్తూరు ప్రాంతాన్ని నోటిఫై చేయాల్సి ఉంది. ఇది పూర్తిగా చిత్తడి నేల సంరక్షణకు తీసుకోబడ్డ మంచి నిర్ణయం అన్నారు.

మధ్యాహ్న భోజన పథకంపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజన పథకంపై నిర్వాహకులు, పర్యవేక్షకులు నిర్లక్ష్యం వహించరాదని ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి బోయ వినోద్ కుమార్ సూచించారు. బుధవారం ఆయన స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. మెనూ ప్రకారం భోజనం సరఫరా చేయాల్సివుండేదని స్పష్టం చేశారు. పొట్టు తీయకుండా ఉడకబెట్టిన కోడి గుడ్లను విద్యార్థులకు అందజేయడం పట్ల నిర్వాహకులపై మండిపడ్డారు. పొట్టు తీసుకుని తినే క్రమంలో 800 మందికి పైగా ఉన్న విద్యార్థినిలు ఇబ్బంది పడుతున్నారని, ఆ ప్రాంతమంతా అపరిశుభ్రంగా తయారవుతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకులు రమణ, సిఐటియు జిల్లా కార్యదర్శి పెనగడం గురవయ్య, గంధం మణి తదితరులు పాల్గొన్నారు.

రుద్ర మోహన్‌కు 'కవి రత్న' బిరుదు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : అంతర్జాతీయ సాహిత్య, సాంస్కృతిక సేవా సంస్థ, 36ప్రపంచ రికార్డులు సాధించిన శ్రీ "కళావేదిక వారు ఈనెల 27 వ తేదీన "విశ్వ సాగర కవితోత్సవం "పేరిట విశాఖపట్నం శుభం ఫంక్షన్ హాలులో 150వ జాతీయ శతాధిక కవి సమ్మేళనంలో 150మంది కవులకు సాహితీ పట్టాభిషేకం నిర్వహించారు. రచయిత, కవి, పుత్తూరుకు చెందిన అత్తూరు రుద్ర మోహన్‌కు కవి రత్న బిరుదు ప్రదానం చేశారు. అంతర్జాతీయ చైర్మన్ డాక్టర్ కత్తిమండ ప్రతాప్ కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి పార్థసారథి, జాతీయ అధ్యక్షురాలు ఈశ్వరి చేతుల మీదుగా కవిరత్న బిరుదు అందుకున్నారు.

పాఠశాలలను తనిఖీ చేసిన ఎంఈఓ

ప్రజాశక్తి -దొరవారిసత్రం : మండల పరిధిలోని పోలిరెడ్డిపాలెం, ప్రాథమిక పాఠశాలలను బుధవారం మండల విద్యాశాఖ అధికారి-2 కృష్ణయ్య తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా పాఠశాల లోని రికార్డులను పరిశీలించి విద్యార్థుల హాజరు పరిశీలించారు. మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి, భోజనాన్ని రుచి చూశారు. విద్యార్థులకు భోజనం మెనూ ప్రకారం అందించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ అధికారితో పాటు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

బడి ఈడు పిల్లలను బడిలో చేర్పించండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: మండలంలోని కాంపాలెం పంచాయతీకి చెందిన ఎస్టీ కాలనీలో బుధవారం ఉదయం విద్యా శాఖ అధికారి రవీంద్రనాథ్, లక్ష్మీపురం పాఠశాల ఉపాధ్యాయులు సతీష్ కుమార్‌లు పర్యటించి బడి ఈడు పిల్లలను బడికి పంపించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. పాఠశాలకు వచ్చేందుకు దూరమవుతోందని వారు, పోను ఆటో ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. దీంతో తల్లిదండ్రులు తమ పిల్లలను బడికి పంపేందుకు అంగీకరించినట్లు ఆయన తెలిపారు.

పుత్తూరు మండల సిపిఐ కార్యదర్శిగా మహేష్

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్: సిపిఐ పుత్తూరు మండల కార్యదర్శిగా డి.మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. బుధవారం పుత్తూరు అంబేద్కర్ భవనంలో పార్టీ ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో సిపిఐ పుత్తూరు మండల నూతన కమిటీని సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి ఆధ్వర్యంలోఎన్నుకోవడం జరిగింది. కార్యవర్గ సభ్యులుగా 13 మందిని ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ పేద సమస్యలపై పోరాడుతా నన్నారు. కార్యక్రమంలో సిపిఐ నాయకులు పాల్గొన్నారు.

దళితవాడల అభివృద్ధి బొజ్జల కల

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి నియోజకవర్గంలో ఉన్న దళితవాడలను మౌలికంగా అభివృద్ధి చేయడం తన తండ్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి కలనీ, ఆ కలను నెరవేర్చేందుకు కృషి చేసినట్లు శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. సుపరి పాలనలో తొలి అడుగు కార్యక్రమాన్ని బుధవారం వీఎంపల్లిలో నిర్వహించారు. ఏడాదిలో ప్రభుత్వం సాధించిన విజయాలను, అందించిన సంక్షేమ ఫలాలను ప్రజలకు కరపత్రాల ద్వారా తెలియజేశారు. గ్రీన్ ప్లే పరిశ్రమ సిఎస్ఆర్ నిధులతో ఏర్పాటుచేసిన ఆరో ప్లాంట్‌ను ప్రారంభించారు. వీఎంపల్లి అభివృద్ధికి ఎలాంటి సాయం కావాలన్నా అందజేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్ నాయుడు, కాసరం రమేష్, కూలి సన్నీ తదితరులు పాల్గొన్నారు.

మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు ఎన్‌బిఏ అక్రిడిటేషన్

ప్రజాశక్తి - క్యాంపస్ : టీటీడీ ఆధ్వర్యంలో తిరుపతిలో నిర్వహిస్తున్న శ్రీ పద్మావతీ మహిళా పాలిటెక్నిక్ కళాశాలకు 2028వ సంవత్సరం వరకు నేషనల్ బోర్డు అక్రిడిటేషన్ (ఎన్.బి.ఎ) మంజూరు చేసింది. ఈ సందర్భంగా టిటిడి ఈవో జె.శ్యామలరావు మాట్లాడుతూ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎం.పద్మావతమ్మ, అధ్యాపకులు, సిబ్బంది సమిష్టి కృషితో పాలిటెక్నిక్ కళాశాలకు నేషనల్ బోర్డ్ అక్రెడిటేషన్ మంజూరయిందని అభినందించారు. అక్రిడిటేషన్‌కు సహకరించిన టిటిడి ఈవో శ్యామలరావు, జెఈవో వీరబ్రహ్మం, డిఈవో వేంకట సునీల్, కళాశాల బృందానికి ప్రిన్సిపాల్ డా.ఎం. పద్మావతమ్మ ధన్యవాదాలు తెలిపారు.

స్వాతికి డాక్టరేట్

ప్రజాశక్తి - క్యాంపస్ : మహిళా వర్సిటీ ఇంగ్లీష్ విభాగం పరిశోధక విద్యార్థిని డి.స్వాతికి వర్సిటీ డాక్టరేట్ ప్రదానం చేసింది. ఆచార్య హరిపద్మరాణి మార్గదర్శకత్వంలో 'ట్రాన్సలేటింగ్ ది 1960స్ తెలుగు నావెల్ రేపటి వెలుగు ఇన్ టు ఇంగ్లీష్ – ఏ స్టడీ అఫ్ ది చల్లేంజెస్' అంశం పై పరిశోధన గ్రంథం సమర్పించినందుకు డాక్టరేట్ ప్రదానం చేసినట్లు డీన్ ఆఫ్ ఎక్సమినేషన్స్ ఆచార్య అనురాధ తెలిపారు.

చెంచురెడ్డికి బియ్యపు పరామర్శ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: అనారోగ్యం బారిన పడి తిరుపతి సంకల్ప హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న శ్రీకాళహస్తి మాజీ ఎమ్మెల్యే, వైసీపీ సీనియర్ నేత తాటిపర్తి చెంచు రెడ్డిని మాజీ ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్ రెడ్డి బుధవారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మెరుగైన వైద్యం అందించాల్సిందిగా వైద్యులను కోరారు. చెంచు రెడ్డి త్వరగా కోలుకుని రాజకీయ జీవితంలోకి రావాలని ఆకాంక్షించారు. అంజూరు శ్రీనివాసులు, మాజీ కౌన్సిలర్ ఉత్తరాది శరవణ తదితరులు పాల్గొన్నారు.

శివుని సేవలో విజిలెన్స్ కమిషనర్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: స్థానిక శ్రీకాళహస్తీశ్వరాలయానికి ఏపీ విజిలెన్స్ కమిషనర్ అనిల్ చంద్ర పునీత్ బుధవారం కుటుంబ సమేతంగా విచ్చేశారు. ఆయనకు ఆలయ అధికారులు సాంప్రదాయ స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. గురుదక్షిణామూర్తి ఆలయం వద్ద వేద పండితులు ఆశీర్వచనాలు పలకగా, ఈవో బాపిరెడ్డి ముక్కంటి తీర్థప్రసాదాలు, జ్ఞాపికలు అందజేశారు.

ప్రతి కుటుంబానికి 100 రోజులు పని

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: బుచ్చినాయుడు కండ్రిగ మండలం, వి.యస్ పురం పంచాయతీలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను పథక సంచాలకులు సి.వి.శ్రీనివాస ప్రసాద్ బుధవారం పరిశీలించారు. పొల్లాల్లో ఫారం పాడ్ పనులను పర్యవేక్షించారు. ప్రతి కుటుంబానికి 100 రోజులు పని ఉండాలని సూచించారు. రైతులకు ఇస్తున్న పళ్ళ, పూల తోటల వివరాలు తెలియజేశారు.

పి4 సర్వేలో బంగారు కుటుంబాలను పారదర్శకతతో గుర్తించాలి

బుచ్చినాయుడు కండ్రిగ మండల కేంద్రంలో మండల స్థాయి అధికారులతో, పంచాయతీ కార్యాదర్శులతో పి4 ద్వారా బంగారు కుటుంబాలను, మార్గదర్శులను పారదర్శకతతో గుర్తించి నమోదు చేయాలని సత్యవేడు నియోజకవర్గం ప్రత్యేక అధికారి, డ్వామా పథక సంచాలకులు సి.వి.శ్రీనివాస్ ప్రసాద్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో ఎం.పీ.డీ.ఓ వెంకటరత్నమ్మ, అదనపు కార్యక్రమాధికారి చంద్రశేఖర రాజు, ఇంజనీరింగ్ కన్సల్టెంట్ భానుశేఖర్, టెక్నికల్ అసిస్టెంట్‌లు, ఉపాధి హామీ శ్రామికులు పాల్గొన్నారు.

డీసీఎంఎస్ మాజీ చైర్మన్‌ను విమర్శించే స్థాయి టీడీపీకి లేదు

ప్రజాశక్తి - చిన్నగొట్టిగల్లు: డీసీఎంఎస్ మాజీ చైర్మన్ సహదేవరెడ్డిని విమర్శించే స్థాయి టీడీపీ నాయకులకు లేదని వైసీపీ మండల అధ్యక్షులు సింహాల మోహన్ పేర్కొన్నారు. ఏడాది పాలనలో పోలీసుల సహకారంతో వైఎస్ఆర్సిపి నాయకుల పై అక్రమ కేసులు పెట్టడం నిజం కాదాని ప్రశ్నించారు. భూ కబ్జాలు వైసీపీ నాయకులు చేశారని ఆరోపించడం విడ్డూరంగా ఉందన్నారు. పోలీసులు అక్రమ కేసులు పెట్టలేదని చెప్పారు. వీటిపై బహిరంగ చర్చకు మేము సిద్ధం.. మీరు సిద్ధమా అని సవాల్ విసిరారు. కాణిపాకంలో సత్య ప్రమాణానికి మీరు సిద్ధమా, తెలుగుదేశం నాయకులు నిర్ణయించుకొని తెలపండన్నారు.

నిమజ్జనం రోజున మద్యం షాపులు బంద్ చేయించండి

కలెక్టర్ వెంకటేశ్వర్‌కు సామంచి శ్రీనివాస్ వినతి

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: ఆగస్టు 27 వ తేదీ నవినాయక చవితిని పురస్కరించుకుని ఆగస్టు 31 న నిమజ్జనం రోజున నగరంలో మద్యపాన నిషేధం, మద్యం షాపులు మూయించాలని తిరుపతి వరసిద్ధి వినాయక మహోత్సవ కమిటీ కన్వీనర్ సామంచి శ్రీనివాస్ బుధవారం జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం అందచేశారు. ఆయన కలెక్టర్‌తో మాట్లాడుతూ 27న వినాయక చవితిని పురష్కరించుకొని తిరుపతి, పరిసర ప్రాంతాల్లో సుమారు 1000 గణేశ ప్రతిమలను ప్రతిష్టించి, పూజా కార్యక్రమాలు నిర్వహించి, అనంతరం 31వతేదీన వినాయక సాగర్, చెన్నాయగుంట చెరువు, దామినేడు చెరువు, గొల్లపల్లిలో నిమజ్జనము చేయనున్నామని తెలిపారు. ఇందుకోసం లైటింగ్, బారికేడింగ్, ప్రథమ చికిత్స, పోలీసు బందోబస్తు వంటి వాటికి, ఆదేశాలు జారీ చేయాలని కోరారు. నిమజ్జనం రోజున నగరంలో మద్యం షాపులు మూసేయించాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు ఆర్.సి.మునికృష్ణ, కరాటే శ్రీనివాస్, ఆకుల సతీష్, గుండాల గోపి, చెన్నం నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఆర్ కళాశాల అక్రమాలకు అడ్డుకట్ట వేయండి : ఎస్ఎఫ్ఐ

ప్రజాశక్తి - క్యాంపస్ : శ్రీనివాసపురంలో ఉన్న ఎస్ఆర్ కళాశాల అక్రమాలకు అడ్డు అదుపు లేకుండా ఉందని, విద్యార్థుల తల్లితండ్రులను మోసం చేస్తున్న కళాశాలను సీజ్ చేయాలనీ తల్లితండ్రులు, ఎస్ఎఫ్ఐ నాయకులు బుధవారం ఆర్ఐఓ రాజశేఖర్ రెడ్డికి వినతిపత్రం ఇచ్చారు. కళాశాల చేర్చుకునే ముందు మెరిట్ విద్యార్థులకు 50 శాతం రాయితీ అని చెప్పి, ఇప్పుడు అదనంగా రూ.20,000 వసూలు చేస్తున్నారని తల్లిదండ్రులు ఆరోపించారు. సెకండ్ ఇయర్ టీసీ ఇవ్వాలని గత రెండు నెలల నుంచి అడుగుతున్నా అదనంగా రూ.50 వేలు కడితేనే ఇస్తామన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు అక్బర్, కార్యదర్శి రవి, నగర కార్యదర్శి తేజ ఎస్ఆర్ జూనియర్ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు. విద్యా సంస్థలు వ్యాపార కేంద్రాలుగా మారాయని విమర్శించారు. ఆర్ఐఓ మాట్లాడతూ నేనే స్వయంగా 10 మందికి టీసీలు ఇప్పించానని, నోటీసు కూడా ఇవ్వడం జరిగిందని, సీజ్ చేసే అధికారం తనకు లేదని తెలిపారు. ఆ కళాశాలపై రిపోర్ట్ రాసి బోర్డ్ కు పంపుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎస్‌యూఐ రాష్ట్ర కార్యదర్శి మల్లికార్జున, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

టెన్నిస్ బాల్ విజేత లిటిల్ ఏంజెల్స్ స్కూల్

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: టెన్నిస్ బాల్ జిల్లా క్రికెట్ పోటీలలో లిటిల్ ఏంజెల్ స్కూల్ క్రీడాకారులు విజేతగా నిలిచారు. స్థానిక తుమ్మలగుంట గ్రౌండ్ లో అండర్ -14,17 బాలురు పోటీలు 29, 30 తేది లలో జరిగాయి. ఇందులో 14 టీమ్ లు హాజరైయ్యాయి. అండర్- 14 పోటీల్లో మొదటి స్థానం లిటిల్ ఏంజెల్స్ పాఠశాల, రెండవ స్థానం ఇంటర్ నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్. మూడవ స్థానం సోక్రాటీస్, నాగార్జున పబ్లిక్ స్కూల్స్ మిశ్రంగా విజేతగా నిలిచాయి. అండర్ 17లో మొదటి స్థానం ఇంటర్ నేషనల్ ఢిల్లీ పబ్లిక్ స్కూల్, రెండవస్థానం రెయిన్బో స్కూల్, మూడవస్థానం జిఎస్ ఆర్ మాగ్నిటిక్, లిటిల్ ఏంజెల్స్ గెలుపొందాయి. గెలుపొందిన క్రీడాకారులుకి లక్ష్మి చారిటబుల్ పౌండేషన్ డైరెక్టర్ కొప్పర్ల దివాకర్ మెడల్, ట్రోఫీ, సర్టిఫికెట్ అందించారు. అండర్ 14లో ప్రథమ, అండర్ 17లో తృతీయ స్థానాలో నిలచిన లిటిల్ ఏంజిల్స్ విద్యార్థులను కరస్పాండెంట్ కె. రాజగోపాల్ రెడ్డి, చైర్పర్సన్ రమాదేవి, డైరెక్టర్ డా. శ్వేత అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ ప్రతినిధులు దేవరాజ్, హేమంత్ కుమార్, మనోహర్, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీవారి పాదాల చెంత ఉద్యోగ విరమణ చేయడం అదృష్టం

- మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారి బాలాజీ



ప్రజాశక్తి - తిరుపతి టౌన్: శ్రీ వెంకటేశ్వర స్వామి పాదాల చెంత పదవీ విరమణ చేయడం ఎంతో సంతోషాన్ని కలిగిస్తుందని, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్ అసిస్టెంట్ సిటీ ప్లానింగ్ అధికారి ఈడగొట్టి బాలాజీ ప్రజాశక్తికి తెలిపారు. ఈనెల 31వ తేదీన పదవీ విరమణ చేయనున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ టౌన్ ప్లానింగ్ విభాగంలో పనిచేసే ఎంతోమందికి తన వంతు సహాయ సహకారాలు అందించడమే కాక, టౌన్ ప్లానింగ్ విభాగంలో అనేక సలహాలు, సూచనలు ఇవ్వడంతో తాను పనిచేసిన చోట ఎంతో అభివృద్ధి జరిగిందని తెలియజేశారు. తాను పనిచేసిన ప్రతి మున్సిపాలిటీ కార్పొరేషన్‌లో భవన నిర్మాణాలు అనుమతులు సకాలంలో ఇచ్చి అక్రమ కట్టడాల నివారణకు ఎంతో కృషి చేయడం జరిగిందన్నారు. పలు మున్సిపాలిటీల్లో మాస్టర్ ప్లాన్ రోడ్లు వేయడమే కాక, ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా విధులు నిర్వహించడం జరిగిందన్నారు. ముఖ్యంగా తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్‌లో ట్రాఫిక్ సమస్య నివారణ కోసం టౌన్ ప్లానింగ్ విభాగంలో తాను పనిచేసిన సమయంలో కృషి చేయడం జరిగిందన్నారు. మాస్టర్ ప్లాన్ రోడ్డు బాధితులకు టిడిఆర్ బాండ్లు ఇవ్వడంలో తన కృషి ఫలించిందని తెలిపారు. దాంతో పాటు మున్సిపల్ స్థలాలు కబ్జాలకు గురి కాకుండా పరిరక్షించడం జరిగిందని తెలిపారు. ఆయన కుటుంబ నేపథ్యాన్ని తెలుపుతూ, తన స్వగ్రామం చిత్తూరు జిల్లా, వాయల్పాడు తాలూకా, మద్రిపాడు, మోరవపల్లిఅని తెలిపారు. తన శ్రీమతి ఈశ్వరి, ముగ్గురు పిల్లలు దిలీప్, ప్రదీప్, సందీప్‌లతో, మనవళ్లు, మనవరాళ్లతో తన విశ్రాంత జీవనం గడుపనుందని సంతృప్తి వ్యక్తం చేశారు.

1987లో చిత్తూరు మున్సిపాలిటీలో తన ఉద్యోగ ప్రస్థానం ప్రారంభమైందని, అనంతరం శ్రీకాళహస్తి, అనంతపురం, ధర్మవరం, పుంగనూరు, రాజంపేట, విజయవాడ, రాజమహేంద్రవరం, తిరుపతి మున్సిపల్ కార్పొరేషన్లలో వివిధ హోదాల్లో పనిచేసినట్లు తెలిపారు. ఇప్పుడు పదవీ విరమణ చేయనున్నట్లు తెలిపారు. తన ఉద్యోగ జీవితం ఎంతో నిజాయితీతో, నిబద్ధతతో చేయడం ఎంతో ఆత్మ సంతృప్తినిచ్చిందని పేర్కొన్నారు.

రేపు సామాజిక భద్రత పెన్షన్లు పంపిణీ

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): ఆగస్టు నెలకు సంబంధించి ఎన్టీఆర్ భరోసా సామాజిక భద్రత పింఛన్లను లబ్ధిదారుల వద్దకే వెళ్లి పంపిణీ చేయాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. తిరుపతి జిల్లాలో 2,63,743 పింఛన్ల లబ్ధిదారులకు గాను రూ.113,14, 6500 కోట్ల రూపాయలను విడుదల చేశారన్నారు. పెండింగ్‌లో ఉన్న(2019 ఏప్రిల్ నుండి 2023 వరకు 1390, 2023 డిసెంబర్ నుండి అక్టోబర్ 2024 వరకు 2404, 2024 నవంబర్ నుండి జూలై 2025 వరకు 977) స్పౌజ్ పింఛన్లు 4771 ఒకటో తేదీనే పంపిణీ చేస్తున్నామన్నారు. స్పౌజ్ క్యాటగిరి పింఛన్లకు సంబంధించి ఇంకనూ లబ్ధిదారులకు సాంకేతిక సమస్యలుంటే పరిష్కరించి వచ్చేనెల పంపిణీ చేస్తామన్నారు.

మానవ అక్రమ రవాణాపై అవగాహన

ప్రజాశక్తి -ఏర్పేడు : ప్రగతి సంస్థ ఆధ్వర్యంలో ఏర్పేడు హైస్కూల్ ప్లస్‌లో మానవ అక్రమ రవాణా దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రగతి సంస్థ ప్రాజెక్ట్ కో ఆర్డినేటర్ మాట్లాడుతూ బాల బాలికలు ఎదుర్కొంటున్న అక్రమ రవాణా గురించి అక్రమ రవాణా చేసి వాళ్ళ అవయవాలను వారికి తెలియకుండా తీసుకోవడం గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం, ఎంఐఎస్ కోఆర్డినేటర్ మంజుష, ప్రగతి సంస్థ కో ఆర్డినేటర్లు వెంకటేష్, మురగయ్య పాల్గొన్నారు.

సాధారణ కౌన్సిల్ సమావేశం

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : బుధవారం మున్సిపల్ కార్యాలయంలో చైర్మన్ హరి అధ్యక్షతన జరిగిన సాధారణ కౌన్సిల్ సమావేశంలో ఈ అంశంతో పాటు తాగునీరు, పారిశుధ్యం, డ్రైనేజీ సమస్యలు, కాలువ ఆక్రమణలు, నిరుద్యోగ కార్మికుల సమస్యలు, కుక్కల విపరీత పెరుగుదల, రోడ్డు మరమ్మత్తులు, లబ్ధిదారుల ఇండ్ల నిర్మాణం ఆలస్యం వంటి అనేక సమస్యలు చర్చకు వచ్చాయి. ఈ సమావేశంలో శ్రీ ద్రౌపది సమేత శ్రీ ధర్మరాజుల వార్షిక బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికలో మున్సిపల్ చైర్మన్, కమిషనర్ పేర్లు లేకపోవడంతో వివాదం చెలరేగింది. మున్సిపల్ చైర్మన్ ఏ.హరి మాట్లాడుతూ చైర్మన్, కమిషనర్ పేర్లను ఆహ్వాన పత్రికలో పొందుపరచక పోవడం రాజకీయ ప్రేరేపిత చర్య అని మండిపడ్డారు. ఈ ఘటనపై టిడిపి కౌన్సిలర్ గాలి జీవరత్నం నాయుడు స్పందిస్తూ ఆలయ కమిటీ దృష్టికి తీసుకెళ్లి, ఇకపై ఇలాంటి నిర్లక్ష్యం జరగకుండా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ డి.జయప్రకాశ్, డి.శంకర్, కౌన్సిలర్లు, మున్సిపల్ శాఖాధికారులు పాల్గొన్నారు.

అక్షర ఆంధ్ర, ఉల్లాస్‌తో మహిళల అక్షరాస్యత

ప్రజాశక్తి-తిరుపతి(మంగళం): తిరుపతి జిల్లా పరిధిలో అక్షర ఆంధ్ర, ఉల్లాస్ కార్యక్రమం ద్వారా 2025 – 26 విద్యా సంవత్సరానికి గాను జిల్లాలో ఉన్న 74 వేల 450 మంది మహిళా నిరక్షరాస్యులను అక్షరాసులుగా తీర్చి దిద్దనన్నట్లు డిఆర్డిఏ ప్రాజెక్టు డైరెక్టర్ శోభన్ బాబు తెలిపారు. బుధవారం తిరుపతి రూరల్ ఎంపీడీవో కార్యాలయం వేదికగా జిల్లాలోని 33 మండలాల వెలుగు ఏపీఎంలు, మహాత్మా గాంధీ నేషనల్ రూరల్ ఎంప్లాయిమెంట్ గ్యారెంటీ స్కీమ్ ఏపీఓలతో సమావేశాన్ని నిర్వహించారు. మహిళల అక్షరాస్యతను పెంపొందించడానికి 7445 మంది స్వచ్ఛంద బోధకులను గుర్తించి వారికి 1:10 నిష్పత్తి రేషియోలో నిరక్షరాస్యలను మ్యాపింగ్ చేసి ఈనెల ఏడవ తేదీ సాయంత్రం 5 గంటల నుండి 7 వరకు బోధన కార్యక్రమాన్ని ప్రారంభించనున్నామన్నారు. అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలో ఈ బోధన కార్యక్రమం ఏర్పాటు చేసుకోవాలని ఇప్పటికే జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశాలు జారీ చేశారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వయోజన విద్య డిప్యూటీ డైరెక్టర్ మహమ్మద్ ఆజాద్, తిరుపతి రూరల్ ఎంపీడీవో రామచంద్ర పాల్గొన్నారు.

కూటమి పాలనలో మహిళలకు పెద్దపీట

ప్రజాశక్తి - సత్యవేడు: కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పేర్కొన్నారు. బుధవారం సత్యవేడు వెలుగు కార్యాలయంలో 213 డ్వాక్రా సంఘాలలోని 955 మంది మహిళలకు రూ.8.34 కోట్ల శ్రీనిధి, బ్యాంకు లింకేజి రుణాలను ఎమ్మెల్యే ఆదిమూలం చేతులు మీదుగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా ఎదగాలని సూచించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ బ్యాంక్ మేనేజర్ సూర్య ప్రకాష్, ఫీల్డ్ అధికారి చైతన్య, గ్రామీణ బ్యాంక్ మేనేజర్ సుబ్బారావు, డిసిసి బ్యాంక్ మేనేజర్ కార్తీక్, వెలుగు కోఆర్డినేటర్లు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సిపిఐ జిల్లా మహాసభలకు తరలిరండి

ప్రజాశక్తి - బుచ్చినాయుడు కండ్రిగ: తిరుపతి జిల్లా, సూళ్లూరుపేటలో సిపిఐ 100 సంవత్సరాలు పూర్తి చేసుకుని 101 వ సంవత్సరంలో అడుగు పెడుతున్న సందర్భంగా బిఎన్ కండ్రిగ పరిధిలో బుధవారం పోస్టర్ ఆవిష్కరణ జరిగింది. ఈ సందర్భంగా కత్తి ధర్మయ్య మాట్లాడుతూ బుచ్చినాయుడు కండ్రిగ మండలంలో ఉన్న శాఖా కార్యదర్శులు, సానుభూతిపరులు ప్రతి ఒక్కరు జిల్లా మహాసభను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వెంకట కృష్ణయ్య, పెళ్లూరైన పీటర్, వెంకటమ్మ, రవణమ్మ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అభినయ్ రెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - తిరుపతి సిటీ : వైఎస్ఆర్సిపి తిరుపతి నియోజకవర్గం ఇన్చార్జి భూమన అభినయ రెడ్డి పుట్టినరోజు వేడుకలు బుధవారం నగరంలో ఘనంగా నిర్వహించారు. నగరంలోని పలు వార్డుల్లో వైసీపీ నాయకులు కేక్ కట్ చేసి, సంబరాలు జరుపుకున్నారు పద్మావతి పురం, జీవకోన తదితర ప్రాంతాలలో విద్యార్థులకు విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఉదయం వంశీ, పసుపులేటి సురేష్, చంద్ర, తదితరులు పాల్గొన్నారు.

అత్యవసర వైద్య సేవలపట్ల పీఎంపీలు అవగాహన కలిగిఉండాలి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : కమ్యూనిటీ పారామెడిక్స్ అండ్ ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ (పిఎంపి అసోసియేషన్ ఆఫ్ ఇండియా) గూడూరు–నాయుడుపేట డివిజన్ ఉపాధ్యక్షులు చిరమన సాయిమురళి అధ్యక్షతన బుధవారం, గూడూరు, మాయాబజారు రోడ్ లోని కెవి హాస్పిటల్స్ సమావేశ మందిరములో కిడ్నీ, గ్యాస్ట్రో ఎంట్రాలజీపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా నారాయణ హాస్పిటల్ మూత్రపిండ వ్యాధి వైద్య నిపుణులు డాక్టర్ ఎస్.రాఘవేంద్ర మాట్లాడుతూ పీఎంపీలు మూత్రపిండ వ్యాధులపట్ల అవగాహన కలిగిఉండి, గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. నారాయణ హాస్పిటల్ సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్ డాక్టర్ వి.ద్వారకానాథ్ రెడ్డి మాట్లాడుతూ గ్యాస్ ట్రబుల్‌కు సంబంధించి సమస్యలున్నవారు వైద్యుడిని సంప్రదించాలని సూచించారు. అనంతరం పీ.యం.పీ నాయకులు డాక్టర్ ద్వారకానాథ్ రెడ్డి, డాక్టర్ రాఘవేంద్ర, కె.వి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ త్రివిక్రమ్, డాక్టర్ కీర్తిలను సన్మానించారు. ఈ కార్యక్రమంలో నారాయణ హాస్పిటల్ ఏవో వెంకటేశ్వర్లు, డివిజన్ పిఎంపి నాయకులు సి.సాయిమురళి, షేక్ కరీముల్లా, ఈ.సాంసన్, పి.చంద్రమోహన్, టి.శంకరమ్మ డి.కవిత తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: తిరుపతి, మంగళం రూరల్స్ సెక్షన్‌లో, మునిసిపల్ కార్పొరేషన్ అండర్ డ్రైనేజీకి సంబంధించి విద్యుత్ లైన్లు మరమ్మత్తులు కారణంగా గురువారం ఉదయం 9 నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏపి ఎస్పిడిసిఎల్ తిరుపతి డివిజన్ ఈఈ విన్నకోటి చంద్ర శేఖర్ రావు ఒక ప్రకటనలో తెలిపారు. పిడి నగర్ తదితర పరిసర ప్రాంతాల వినియోగదారులు సహకరించాలని కోరారు.

శ్రీకృష్ణదేవరాయలవారి జయంతిపై వివక్ష తగదు

ప్రజాశక్తి - రామచంద్రపురం (చంద్రగిరి): శ్రీకృష్ణ దేవరాయులవారిపై వివక్షతో జయంతిని నిర్వహించకుండా రాయలవారి పట్ల చిన్నచూపు చూడడం ప్రభుత్వాలకు టీటీడీకి తగదని రాయల్ పీపుల్స్ ఫ్రెంట్ సభ్యులు ఆరోపించారు. శ్రీకృష్ణదేవరాయల జయంతి సాధన కోసం నిర్వహించే పాదయాత్రను జయప్రదం చేయాలని రాయల్ పీపుల్స్ ఫ్రంట్ సెంట్రల్ జాయింట్ యాక్షన్ కమిటీ బుధవారం ఓ ప్రకటనలో కోరారు. రాయలవారి జయంతి సాధన కోసం చేపట్టే ఈ పాదయాత్ర చంద్రగిరి కోట నుండి అలిపిరి వరకు జరుగుతుందన్నారు. బలిజ, కాపు, తెలగ, ఒంటరి సోదరులు పాదయాత్రను జయప్రదం చేయాలని కోరారు.

గంగమ్మ జాతరలో రోజా

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండలం కేబిఆర్‌పురంలో బుధవారం జరిగిన గంగమ్మ జాతర మహోత్సవంలో మాజీ మంత్రి ఆర్.కే రోజా పాల్గొన్నారు. వైసీపీ నాయకులు ఆమెకు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

Before The Honourable Deputy Registrar Of Chits at Tirupati
(Application for reference of a Dispute)
Dispute No. 62 of 2024
Vajrankura Chit Funds Pvt.Ltd., Naidupet Branch, represented by its Legal Officer, Md.Gouse Mohiuddin, Being authorized person. ... Disputant.
Versus
1. Mr. **Papireddy Raja Sekhar** and 3 Others ... Opponents.
Notice
To,
Opp-2. Mr. **Puttu Kamalakar,** S/o **Narayana Setty,** Occ: Police Constable, Naidupeta, R/o Chembedu Village & Post, Pellakuru Mandal, Tirupati Dt.
Opp-4. Mrs.**Erampalli Devaprasad Therisa Rani,** W/o **Anand Kumar,** Occ: Office Subordinate, UHPH, Ballreddy Palem, R/o D/o Deva Prasad, Vakadu Town, & Mandal, Tirupati Dt.
పై నెంబరున డిస్ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, తిరుపతి వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు నోటీసు నిమిత్తం **తే23-08-2025**దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, తిరుపతి వారి ఆఫీసులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
కె.నవకోటి,
బి.రాజ్యలక్ష్మి,
అడ్వకేట్స్
డోర్ నెం.25/3/2, కె.బి.ఆర్. మాల్, 2వ ఫ్లోర్, పద్మావతి సెంటర్, పొదలకూరు రోడ్డు, నెల్లూరు టౌన్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

Before The Honourable Deputy Registrar Of Chits at Tirupati
(Application for reference of a Dispute)
Dispute No. 108 of 2024
Vajrankura Chit Funds Pvt.Ltd., Naidupet Branch, represented by its Legal Officer, Md.Gouse Mohiuddin, Being authorized person. ... Disputant.
Versus
1. Mr. **Sreeram Prasad** and 3 Others ... Opponents.
Notice
To,
Opp-2. Mr. **Salapathi Prasad,** S/o **Krishnaiah,** Occ: Constable AR Platoon-14, Nellore, R/o D.No.199, Kapuluru Village & Post, Naidupeta Mandal, Tirupati Dt.
పై నెంబరున డిస్ప్యూటెంట్ మీ నుండి చిట్ బాకీ బ్యాలెన్స్ మొత్తం రాబట్టుకొనుటకు పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, తిరుపతి వారి ఆఫీసులో కేసు దాఖలు చేసియున్నారు. సదరు కేసులో మీకు నోటీసు నిమిత్తం **తే23-08-2025**దికి వాయిదా వేసియున్నారు. కావున వాయిదా రోజు **ఉదయం 11.00 గంటలకు** మీరు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ పైన తెలిపిన డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ చిట్స్, తిరుపతి వారి ఆఫీసులో హాజరై ఆక్షేపణలు తెలుపుకోవలసినది. లేనియెడల కేసు మీ పరోక్షమున తీర్మానించబడును.
కె.నవకోటి,
బి.రాజ్యలక్ష్మి,
అడ్వకేట్స్
డోర్ నెం.25/3/2, కె.బి.ఆర్. మాల్, 2వ ఫ్లోర్, పద్మావతి సెంటర్, పొదలకూరు రోడ్డు, నెల్లూరు టౌన్, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

క్రైం న్యూస్

మహిళ అనుమానస్పద మృతి

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : గూడూరు రూరల్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ 5 వ వీధి వద్ద మహిళ అనుమానస్పద స్థితిలో మృతి చెందిన సంఘటన మంగళ వారం రాత్రి చోటు చేసుకుంది. గూడూరురూరల్ ఎస్ఐ మనోజ్ కుమార్ కథనం మేరకు మృతురాలు గూడూరు, నలజాలమ్మ వీధిలో నివాసం ఉంటున్న షేక్ సాహేరా భాను (33) గా గుర్తించామన్నారు. ఇందిరమ్మ కాలనీ 5 వ వీధిలో మహిళ చనిపోయిందని స్థానికులు సమాచారం ఇచ్చారన్నారు. మృత దేహంపై ఎటువంటి గాయాలు లేవన్నారు. మృతదేహాన్ని గూడూరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి మార్చురీకి తరలించామన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

ఆటో బోల్తా.. ఒకరు మృతి

మృతి చెందిన కనికాచలం

ప్రజాశక్తి - తిరుపతి సిటీ: అదుపు తప్పి ఆటో బోల్తాపడడంతో వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తికి గాయాలైన ఘటన బుధవారం తిరుపతిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు తిరుపతి రూరల్ పాతకాల్వకు చెందిన కనికాచలం(50), రేణిగుంట గాజుల మండ్యంకు చెందిన రామయ్య(65) ఆటోలో వెళతుండగా నాయుడుపేట పూతలపట్టు ప్రధాన రహదారిలోని తిరుపతి రూరల్ బాలాజీ డైరీ సమీపంలో ఆటో అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవరు కనికాచలం మృతిచెందగా, రామయ్యకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రుడిని ఆసుపత్రికి తరలించారు. పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రుయాకి తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురుగుల మందు తాగి వృద్ధుడు మృతి

మృతి చెందిన ధనశేఖర్

ప్రజాశక్తి - సత్యవేడు: సత్యవేడు పట్టణం, అత్తికాయల వీధిలో నివసిస్తున్న వృద్ధుడు ధనశేఖర్ (58) పురుగుల మందు తాగి మృతి చెందాడు. ఈ సంఘటన మంగళవారం రాత్రి చోటుచేసు కుంది.ఎస్సై రామస్వామి కథనం మేరకు పట్టణంలోని కుమ్మరి గుంట వీధిలో రామానాయుడు కుమారుడు ధన శేఖర్ కుటుంబం నివసిస్తుంది. ధనశేఖర్ సతీమణి ఐదేళ్ల క్రిందట మృతి చెందింది. అప్పటినుంచి ధనశేఖర్ తాగుడుకు బానిసై ప్రతిరోజు మద్యం సేవించేవాడు. ఈ క్రమంలో ఆరోగ్యం క్షీణించడంతో మంగళవారం రాత్రి ధనశేఖర్ క్రిమిసంహారకమందు తాగి మృతి చెందాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్ఐ రామస్వామి తెలిపారు.

వర్షాకాలానికి ముందే నిధులివ్వండి

కలెక్టర్ వెంకటేశ్వర్‌కు ఎమ్మెల్యే బొజ్జల సుధీర్ రెడ్డి వినతి

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి నియోజకవర్గంలో తలపెట్టిన పలు అభివృద్ధి పనులకు వర్షాకాలానికి ముందుగానే నిధులు మంజూరు చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్‌ను శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి కోరారు. తిరుపతి కలెక్టరేట్‌లో కలెక్టర్ వెంకటేశ్వర్‌ను బుధవారం ఎమ్మెల్యే బొజ్జల మర్యాదపూర్వకంగా కలిశారు. అభివృద్ధి పనులు జాబితా, అవసరమైన నిధుల నివేదికను కలెక్టర్ ముందు ఉంచారు. పరిశీలించిన జిల్లా కలెక్టర్ తప్పకుండా నిధులు మంజూరయ్యేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

ఆటో యూనియన్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - తిరుపతి టౌన్: సిఐటియు అనుబంధం ఆటో యూనియన్ నూతన నగర కమిటీని నేడు యశోద నగర్‌లోని వేమన విజ్ఞాన కేంద్రంలో ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. నూతన కమిటీ 25 మందితో ఎన్నికయింది. అధ్యక్షులు ఎస్ బాదుల్లా, ప్రధాన కార్యదర్శి జి వాసు, వర్కింగ్ ప్రెసిడెంట్ గాయత్రి ఆటో స్టాండ్ ప్రసాద్, ఉపాధ్యక్షులుగా రాము, రవి, కుమార్, మురగ, సహాయ కార్యదర్శులుగా ప్రసాదు, హేమాద్రి, మంజునాథ్, జెట్లీ కమిటీ సభ్యులుగా సాయి, వెంకట్ రెడ్డి, టి మురళి, రమణ, దేవరాజులు, ప్రకాష్ యాదవ్, గోపి, ఈశ్వరన్న, సుధాకర్, రామకృష్ణ, చంద్ర, రమణ నాయక్, కాలూరు క్రాస్ మురళి, ఢిల్లీ, చందు, ప్రతాప్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర అధ్యక్షులు టి సుబ్రమణ్యం, ఆటో యూనియన్ జిల్లా కార్యదర్శి తంజావూరు మురళి పాల్గొన్నారు.

ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ రికార్డులు తనిఖీ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : పట్టణంలోని స్థానిక పుత్తూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్‌ను బుధవారం చిత్తూరు డిప్యూటీ కమీషనర్ ప్రొహిబిషన్, ఎక్సైజ్ టి.విజయ్ శేఖర్ ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. ప్రాపర్టీ, రికార్డ్స్ ని పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మద్యం, నాటు సారాయి నేరాల కు సంబంధించి సిబ్బందికి సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో ఇన్స్పెక్టర్ మురళి మోహన్, సబ్ ఇన్స్పెక్టర్ అంజద్, సిబ్బంది పాల్గొన్నారు.

జనరల్ నోటీసు
ఇందు మూలముగా యావన్మందికి తెలియ జేయడం ఏమనగా మేము అనగా
1. మేదరమెట్ల కోదండ రామయ్య S/O కోండయ్య, చవటపాలెం గ్రామం వెంకటాచలం మండలం
2.పచ్చి పులుసు వెంకట ఆనంద కిషోర్ S/O శ్రీరాములు, మధ్వ పతి వారి వీధి, హెడ్ పోస్ట్ ఆఫీస్ దగ్గర నెల్లూరు టౌన్ .
సదరు నెల్లూరు జిల్లా ప్రస్తుతం తిరుపతి జిల్లా గూడూరు టౌన్ రాజా విధి కాపురస్తులు అయిన
1. గాలి సరోజనమ్మ W/O లేట్ చంద్రశేఖర రెడ్డి
2. గాలి రవి కుమార్ రెడ్డి S/O లేట్ చంద్ర శేఖర రెడ్డి
వార్ల వద్ద ఈ క్రింది షెడ్యూలు దాఖలా ఆస్తిని విక్రయ అగ్రిమెంట్ ద్వారా కొనుగోలు చేసుకుని విక్రయ ప్రతిఫలముగా అడ్వాన్సు ఇచ్చియున్నాము మాకు వ్రాసి ఇచ్చిన విక్రయ అగ్రిమెంటు పెండింగ్ లో ఉండగా మాకు కాకుండా వేరే వారికి అమ్మ చూపుతున్నారు అని తెలిసినది.
కావున సదరు గాలి సరోజనమ్మ మరియు గాలి రవికుమార్ గార్ల మాటలకు లోబడి ఎవరైనా కొనుగోలు చేసిన సదరు కొనుగోలు చెల్లనేరదు అని ఇందుమూలముగా తెలియజేయడమైనది ఎవరైనా షెడ్యూలు దాఖలా ఆస్తిని కొనుగోలు చేసిన ఎడల వారిపై మేము చట్టరీత్యా తీసుకొను చర్యలకు బాధ్యులగుదురు
ఆస్తి షెడ్యూలు
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా, గూడూరు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్టు యిలాకా, గూడూరు సబ్ రిజిస్ట్రేషన్లో చేరిన గూడూరు మండలం, పోటుపాళెం గ్రామ పంచాయితీ ఏరియా, తూర్పు గూడూరు గ్రామ సర్వే నెం.1619-1రులోని య.0.58ట్లు లేక 350.9 అంకణములు ఖాళీ స్థలమునకు హద్దులు
తూర్పు: వల్లంకొండ వెంకటసుబ్బయ్య గారి స్థలము
దక్షిణం: చల్లా రామయ్యగారి స్థలము
పడమర: బోడుబోయిన విష్ణుతేజగారి స్థలము
ఉత్తరం : G.N.T. ఈహద్దులలోని య.0.58ట్లు లేక 350.9 అంకణములు ఖాళీ స్థలమున్నూ, సదరు స్థలమునక సంబంధించిన మామూలు రాకపోకలు, యావత్తు యిజ్మెంటు హక్కులతో సహా నీకు విక్రయ ఖరారు పరచడమైనది.